రైతు భరోసాలో కోతలకు రేపు ఆమోదం

సమావేశం కానున్న మంత్రిమండలి

కులగణనతోసహా పలు అంశాలపై చర్చ

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతు భరోసాలో షరతులు, కోతలకు శనివారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో మంత్రిమండలి సమావేశం కానున్నది. ఇందులో ప్రధానంగా రైతు భరోసాపై చర్చించనున్నారు. రైతు భరోసాకు వివిధ ఆంక్షలు విధిస్తూ క్యాబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన సిఫారసులను మంత్రిమండలి చర్చించి ఆమోదించనున్నది. భూమి లేని కూలీలకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సాయం అందించే అంశంపై కూడా చర్చించి ఆమోదించనున్నట్టు తెలుస్తున్నది. భూ భారతి బిల్లు ప్రకారం వీఆర్వో వ్యవస్థ ఏర్పాటుకు సైతం ఆమోదం తెలుపనున్నది. వీఆర్వోలు, సర్వేయర్ల నియామకంపై చర్చించనున్నది. బీసీ రిజర్వేషన్ల కోసం నియమించిన ప్రత్యేక కమిషన్ నివేదికపై చర్చ జరుగనున్నట్టు సమాచారం. రేషన్‌కార్డులు, ఎస్సీ వర్గీకరణ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు తదితర అంశాలపై చర్చించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఆరేండ్లుగా లేనిది.. ఇప్పుడెందుకు?

మొదటిపేజీ తరువాయి...

ఇస్తారా? లేక ప్రభుత్వం చేసే పంటల సర్వే ఆధారంగా ఇస్తారా? ఏదో ఒకటి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నిజానికి, సాగు భూముల లెక్కల కోసం ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఏఈవోల ద్వారా పంటల నమోదు సర్వే చేయిస్తున్నది. దీంతో పాటు కాంగ్రెస్ సర్కారు ప్రత్యేకంగా శాటిలైట్ సర్వే కూడా చేయించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రెండు రోజుల క్రితం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాటిలైట్ సర్వే కంపెనీలతో సమీక్ష కూడా నిర్వహించారు. ఈ రెండు విధానాల్లో ఎలాగూ సాగు లెక్కలు తెలిసిపోతాయి. అలాంటప్పుడు మళ్లీ రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని, పంటల వివరాలు తీసుకోవడంలో అర్థం లేదనే వాదన వినిపిస్తున్నది.

దరఖాస్తు చేయని రైతులకు రైతు భరోసా ఇవ్వరా?

ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు రైతు భరోసా కోసం గ్రామాల్లో దరఖాస్తు తీసుకోవాలని మంత్రుల కమిటీ నిర్ణయించినట్టు సమాచారం. పంట సాగు చేసినప్పటికీ ఒకవేళ ఏదైనా కారణంతో దరఖాస్తు చేయకపోతే ఆ రైతులకు రైతు భరోసా ఇవ్వరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తు కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు మూడు రోజులు మాత్రమే. ఊళ్లో ఎకరమో, అర ఎకరమో భూమి ఉండి.. పట్టణాల్లో చిరుద్యోగాలో, చిన్నచిన్న వ్యాపారాలో చేసుకుంటున్నవారి సంఖ్య భారీగానే ఉంటుంది. చాలామంది రైతులు పెండ్లి అయి అత్త గారి ఇంటికి వెళ్లిన తమ ఆడబిడ్డలకు పసుపు-కుంకుమ, పుట్టింటి కట్నం కింద ఎకరమో, అర ఎకరమో భూములు రాసి ఇస్తారు. పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వలసలు, ఇతర దేశాలకు వెళ్లిన వారూ ఉన్నారు. ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా ఇంటి వద్ద ఉన్న కుటుంబసభ్యులే ఆయా భూముల వ్యవహారాలు చూస్తుంటారు. ఇప్పుడు వీరంతా గ్రామాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవడమంటే వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారం. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఉంటున్న ఒక ఆడబిడ్డకు తన స్వగ్రామంలో అర ఎకరం పొలం ఉన్నదనుకుంటే, ఆమెకు రైతు భరోసా కింద సుమారు రూ.మూడు వేలు వస్తుంది. కానీ, ఇప్పుడు ఆమె తమ గ్రామానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవడానికి రూ.వెయ్యో, పదిహేను వందలో ప్రయాణ చార్జీల కోసం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బడుగు, బలహీనవర్గాల రైతులను కూడా ఇబ్బంది పెట్టేవిధంగా 'దరఖాస్తు' అనే ఒక మూర్ఖపు నిర్ణయం క్యాబినెట్ సబ్ కమిటీ ఎందుకు తీసుకున్నదో ఎవరికీ అంతుచిక్కదు.

రైతు చేతులు రైతు నెత్తిపై పెట్టే ఆలోచన?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ పథకంలో ఏ విధంగా కోతలు పెట్టాలనే ఆలోచన చేస్తున్నది. రైతుబంధులోనూ కోతలు పెట్టాలనే నిర్ణయానికి వచ్చింది. రైతుభరోసా పేరుతో కోతలకు సిద్ధమైంది. ఈ కోతలకు రైతులనే కారణంగా చూపే ఎత్తుగడ వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులో రైతుల నుంచి భూముల వివరాలు, పంట సాగు వివరాలు తీసుకోనున్నారు. ఆ వివరాల మేరకు రైతు భరోసా అందించనున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. రైతులు ఇచ్చిన దరఖాస్తు ప్రకారమే సాగైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించామనే వాదన ప్రభుత్వం లేవనెత్తే అవకాశం ఉన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కోతల కోసమే దరఖాస్తా?

రైతు భరోసా కోసం రైతుల నుంచి దరఖాస్తు తీసుకోవాలనే ప్రభుత్వం ఉద్దేశం ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోతలు పెట్టేందుకే ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దరఖాస్తులకు సాగు భూమికి మాత్రమే ఇస్తామనే షరతు పెట్టనున్నది. ఈ లెక్కన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుడు 3.05 కోట్ల ఎకరాలకు రైతుభరోసా ఇవ్వగా, కాంగ్రెస్ సర్కారు దీనిని 2 కోట్ల ఎకరాలకు తగ్గించే అవకాశాలున్నాయి. ఈ లెక్కన మొత్తం ఏడాదిలో సుమారు కోటి ఎకరాలకు రైతుభరోసా కోతపెట్టడం ఖాయంగా కనిపిస్తున్నది.

లోకం పోకడ

మీరు కంటి జబ్బులకు ఇచ్చిన మందులు వాడినప్పట్నుంచి ఒకటే కాళ్లతీపులు డాక్టర్!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	10.4°c	35.0°c
ఆదిలాబాద్	12.3°c	32.7°c
మెదక్	14.0°c	29.0°c
కరీంనగర్	14.0°c	28.0°c
హైదరాబాద్	15.0°c	30.0°c
మహబూబ్‌నగర్	15.0°c	30.0°c
వరంగల్	16.0°c	28.0°c
ఖమ్మం	16.0°c	29.0°c
నల్లగొండ	17.4°c	29.0°c
నిజామాబాద్	16.4°c	31.3°c

ఈస్ట్ సిటీపై వక్ఫ్‌బాంబ్

మొదటిపేజీ తరువాయి...

కొనుగోలు చేశాడు. అక్కడే ఇంటిని నిర్మించుకున్నాడు. ఇటీవల కూతురు పెండ్లికి అవసరమై ఇంటిని అమ్ముకునేందుకు ప్రయత్నించాడు. కానీ అమ్ముకోవడం కుదరదని, ఆ ఇల్లు నిషేధిత సర్వే నంబర్ల జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు తేల్చిచెప్పారు. ఆశలు ఆవిరి కావడంతో అతడు షాక్‌కు గురై మంచానపడ్డాడు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి, అన్నోజిగూడ, రాంపల్లి, మౌలాలిలోని 20 వేలకు పైగా ఇండ్లు, స్థలాలది ఇదే పరిస్థితి. వీటికి సంబంధించి వక్ఫ్‌బోర్డు సర్క్యులర్ జారీ చేయగా రిజిస్ట్రేషన్లశాఖ నిషేధిత జాబితాలో పెట్టింది. మూడు నెలలుగా వందలాది సర్వే నంబర్ల పరిధిలోని కుటుంబాలు దిక్కుతోచనస్థితిలో పడిపోయాయి.

నగరంలో బడుగులపై సర్కారు మరో పిడుగు

హైదరాబాద్‌లోని బడుగు జీవులపై కాంగ్రెస్ సర్కారు మరో పిడుగు వేసింది. 1989 గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వందకు పైగా కాలనీలను వక్ఫ్ బోర్డు తమ ఆస్తులుగా గుర్తించింది. ప్రజలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా సర్క్యులర్ జారీ చేసింది. ఈ సర్క్యులర్ ఆధారంగా వాటి క్రయ విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో అవసరానికి అమ్ముకోలేక, అప్పులు తీసుకోలేక, అసలు ఆ ఆస్తులే తమవి కాదనే విషయం నమ్మలేక జనం ఆందోళన చెందుతున్నారు. 35 ఏళ్ల క్రితం నాటి గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా వక్ఫ్‌బోర్డు ఇప్పుడు సర్క్యులర్ ఇవ్వడం, వెంటనే రిజిస్ట్రేషన్ల శాఖ నిషేధిత జాబితాలో చేర్చడంలో ఆంతర్యమేంటని నిలదీస్తున్నారు.

కాంగ్రెస్ రూల్... రియల్ ఢమాల్!

కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో పలు నిర్ణయాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని వ్యాపారవర్గాలు చెప్తున్నాయి. భాగ్యనగర స్థిరాస్తి రంగం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తూ పెట్టుబడుల ప్రవాహంలో వేగంగా దూసుకుపోతున్న సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం శాపంగా మారిందని పలు కంపెనీల ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఫార్మా సిటీ, మెట్రో ఎయిర్‌పోర్టు వంటి కీలక ప్రాజెక్టుల రద్దు, హైడ్రా, మూసీ కూల్చివేతలు రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపాయని చాలా అధ్యయనాలు స్పష్టంచేశాయని గుర్తుచేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో భూములు, ఇండ్ల కొనుగోళ్లు, అమ్మకాలు సంక్షోభంలో చిక్కుకున్నాయని వాపోతున్నారు. ఈస్ట్ హైదరాబాద్ మరో హైటెక్ సిటీగా మారుతుందని నిపుణులు అంచనా వేశారని, కానీ ఆ ప్రాంతం కూడా నట్టేట మునిగే పరిస్థితి వచ్చిందని చెప్తున్నారు.

అనాలోచిత నిర్ణయం.. అగమ్యగోచరం

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఏడాదిగా రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. వంద గజాల జాగాను కూడా అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు వక్ఫ్ భూముల పేరిట రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం మరో ఉదాహరణగా నిలుస్తున్నది. ఎప్పుడో కొనుక్కున్న ఆస్తులను ఇప్పుడు వక్ఫ్ భూములుగా నిర్ధారించడం వెనుక భారీ కుట్ర ఉంది. దశాబ్దాల క్రితమే నిర్మితమైన కాలనీలను వక్ఫ్ ఆస్తులుగా నిర్ధారించడం సరికాదు. ప్రభుత్వం చొరవ తీసుకుని, సామాన్యుల ఆస్తులను రక్షించాల్సిన అవసరముంది.

- నారగోని ప్రవీణ్,
తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి

దశాబ్దాల కాలంగా వారసత్వంగా వచ్చిన జాగలను ఇప్పుడు వక్ఫ్ భూములనీ నిర్ధారించడం దారుణం. సామాన్యులు, పేదల ఆస్తులను పరిరక్షించేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి. ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ప్రజలు తీవ్రఆందోళన చెందుతున్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలోనూ ఉంది. సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. సామాన్యుల ఆస్తులకు నష్టం లేకుండా ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సిన అవసరముంది.

-మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

నిషేధిత జాబితాలో 100కుపైగా కాలనీలు

- బోడుప్పల్ సమీపంలోని మేడిపల్లి, అన్నోజిగూడ
- ఈసీఐఎల్ సమీపంలోని రాంపల్లి, ఘట్‌కేసర్
- మౌలాలీగుట్ట సమీపంలోని సఫిల్‌నగర్, హరిజన్‌బస్తీ,
- సాదుల్లానగర్, ద్వారకమాయికాలనీ, సుధానగర్, భజనమందిర్,
- న్యూవేంకటేశ్వర్‌నగర్, భరత్‌నగర్, విష్ణేశ్వర్‌నగర్, గణేశ్‌నగర్,
- మహాత్మా గాంధీనగర్, నెహ్రూనగర్, శ్రామికనగర్,
- ఈస్ట్‌ప్రగతినగర్, ఎస్‌పీనగర్, అండాల్‌నగర్, చందాబాగ్,
- వడ్డెరబస్తీ, ఓల్డ్‌మౌలాలి, బాగ్ ఏ హైదరి, హనుమాన్‌నగర్,
- ఆర్టీసీకాలనీ, కృష్ణానగర్, పీఎన్‌ఆర్‌కాలనీ, కేసీఆర్‌బస్తీ, ఓల్డ్‌సఫిల్‌గూడ,
- రాక్‌హిల్‌కాలనీ, శంకరయ్యకాలనీ, పీబీకాలనీ, జేకేకాలనీ,
- సమతానగర్, ఈస్ట్ కాకతీయనగర్, గీతానగర్, న్యూవిద్యానగర్,
- రాంబ్రహ్మానగర్, శ్రీకృష్ణనగర్, సీతారాంనగర్, బాల్‌రాంనగర్, దేవీనగర్

ఆర్ఆర్ఆర్ భూసేకరణపై వీడని సందిగ్ధత!

- పరిహారం పెంచాల్సిందేనని బాధితుల డిమాండ్
- నిబంధనలు వర్తించవని చెప్తున్న ఎన్‌హెచ్‌ఏఐ
- పెంపును రాష్ట్ర ప్రభుత్వం భరించడమే మార్గం
- రెండుపక్షాల అధికారుల భేటీలో కొరవడిన స్పష్టత

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) భూసేకరణపై సందిగ్ధత వీడటంలేదు. పరిహారం విషయంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సఖ్యత కొరవడినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న భూసేకరణ సమస్యపై చర్చించేందుకు గురువారం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో భేటీ అయ్యారు. ఎన్‌హెచ్‌ఏఐ చేపడుతున్న ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఇప్పటికే టెండర్లు పిలవగా, ఇంకా పలు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాలేదు. భూములకు బదులు భూములివ్వాలని, లేకపోతే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. నోటిఫికేషన్ జారీచేసే నాటి ధర ప్రకారమే పరిహారం చెల్లించేందుకు నిబంధనలు అనుమతిస్తాయని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తర భాగం పనులకు కాంట్రాక్టర్లు ముందుకొస్తారా లేదా అనేది అంతుబట్టడంలేదని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణం తామే చేపడుతామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసింది. దక్షిణ భాగం పనులు కూడా చేపట్టాలని కోరుతూ ఇటీవల కేంద్రానికి లేఖ రాసింది. దక్షిణ భాగం అలైన్‌మెంటులో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. గతంలో ఖరారుచేసిన అలైన్‌మెంట్‌తో పోల్చితే కొత్త అలైన్‌మెంట్ 5 కిలోమీటర్ల వరకు పెరిగినట్టు తెలుస్తున్నది. దీంతో సేకరించాల్సిన భూములు కూడా గణనీయంగా పెరిగాయి. ఈ మార్పులపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలని అధికారులు చెప్తున్నారు.

పరిహారం ఎవరి బాధ్యత?

ఆర్ఆర్ఆర్ కోసం సేకరించే భూములకు పరిహారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలనే ఒప్పందముంది. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పరిహారం పెంచే అవకాశంలేదని అధికారులు చెప్తున్నారు. ఒకవేళ పరిహారం పెంచాలని నిర్ణయించినా ఆ మేరకు అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. పరిహారంపై స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే జిల్లా కలెక్టర్లకు కట్టబెట్టింది. రైతులు కోరుతున్న విధంగా పరిహారాన్ని కలెక్టర్లు నిర్ధారించినా ఆ మేరకు సగం భారం భరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పుకోవడంలేదు. గురువారం సీఎస్‌తో ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల సమావేశంలోనూ స్పష్టత రాలేదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో నేడు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమవుతారని సమాచారం.

గురువారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి డైరీని ఆవిష్కరిస్తున్న రెవెన్యూ సంఘాల నేతలు

'సర్వే తప్పనిసరి'పై సర్కారు వెనక్కి?

మొదటిపేజీ తరువాయి...

చేయాల్సి వస్తుందని, అవినీతి పెరిగిపోతుందని విమర్శలు వచ్చాయి. ఇప్పటికే రైతులు భూ సర్వే చేయించుకునేందుకు నెలలపాటు ఎదురుచూడాల్సి వస్తున్నది. పని పూర్తి కావాలంటే పై అధికారులతో, నేతలతోనో పైరవీలు చేయించాల్సి వస్తున్నది. అయినా ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త నిబంధనతో లంచాలకు తోడు, సర్వే కోసం అదనంగా రుసుము చెల్లించాల్సి వస్తుందని, ఇది అనవసర ఖర్చు అని రైతుల వాదన.

తీవ్రంగా సర్వేయర్ల కొరత..

మరోవైపు రాష్ట్రంలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉన్నది. రాష్ట్రంలో 612 రెవెన్యూ మండలాలు ఉండగా, 250 మంది వరకు మాత్రమే సర్వేయర్లు ఉన్నారు. ప్రస్తుతం మండలాల్లో సగటున రోజుకు 5-10 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఒక్కో సర్వేయర్ రోజుకు 15 భూముల సర్వే చేయాల్సి వస్తుంది. ఇది అసాధ్యమని ప్రభుత్వ సర్వేయర్లే చెప్తున్నారు. మరోవైపు ప్రభుత్వం పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి వెయ్యి మందిని సర్వేయర్లుగా నియమించాలని భావిస్తున్నది. ఇప్పటికే ఆప్షన్లు సైతం స్వీకరించింది. అయితే.. ఈ ప్రతిపాదనను నిరుద్యోగులు, ప్రభుత్వ సర్వేయర్లు వ్యతిరేకిస్తున్నారు. నిబంధనల ప్రకారం సాంకేతిక కోర్సులు చేసినవారే అర్హులని స్పష్టం చేస్తున్నారు.

ఆదాయానికి గండి?

సర్వేతో కొత్త సమస్యలు తెరమీదికి రావడం తోపాటు, క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం దృష్టికి వచ్చినట్టు తెలిసింది. దీంతో ఆదాయం తగ్గుతుందని, ఇది రియల్ ఎస్టేట్ రంగంపైనా ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరించినట్టు సమాచారం. సర్వేయర్ల నియామకం, ఈ నిబంధనతో కలిగే లాభాలను రైతులకు వివరించిన తర్వాతే అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

భూ భారతిని సమర్థంగా అమలుచేయండి

రెవెన్యూ సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): భూ భారతి త్వరలో అమల్లోకి వస్తుందని, రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) కొత్త సంవత్సర డైరీలను సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల మీద ఉన్నదని సీఎం తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్షకార్యదర్శులు ఎస్ రాములు, రమేశ్ పాక , ఫూల్ సింగ్ హాన్, శ్రీనివాసులు, టీజీఆర్ఎస్ఏ అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, భిక్షం, మహిళా అధ్యక్షురాలు సుజాత హాన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి అమలులో సహకరిస్తాం

భూ భారతి చట్టాన్ని అమలు చేయడంలో తమవంతు సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డికి ట్రెసా ప్రతినిధులు స్పష్టం చేశారు. గురువారం వారు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ట్రెసా అధ్యక్ష కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షులు నిరంజన్ రావ్, దేశ్యా నాయక్, నాగమణి, జాయింట్ సెక్రటరీ వాణిరెడ్డి, రమణ్ రెడ్డి, గంగాధర్, కిరణ్, బొమ్మ రాములు పాల్గొన్నారు.

'ఇరిగేషన్ ప్రమోషన్లపై ఫైవ్‌మెన్ కమిటీ

- నెలాఖరులోగా పూర్తికి చర్యలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- 'నమస్తే కథనాని'కి స్పందన

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్ శాఖలో ప్రమోషన్ల సమస్య పరిష్కారానికి ఐదుగురితో కూడిన ఫైవ్‌మెన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్ జలసౌధలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రమోషన్లపై సమీక్షించారు. ఈ మేరకు కమిటీ సభ్యులను నియమిస్తున్నట్టు ప్రకటించారు. సాగునీటిశాఖ ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, సెక్రటరీ రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డిని ఆ కమిటీలో నియమించారు. ఏఈ నుంచి సీఈ వరకు ప్రమోషన్ల నివేదికను 15 రోజుల్లోగా అందజేయాలని కూడా నిర్దేశించినట్టు మంత్రి వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికల్లా ప్రమోషన్లతోపాటు, బదిలీలను కూడా పూర్తిచేస్తామని తెలిపారు. అదేవిధంగా నూతనంగా ఎంపికైన ఇంజినీర్లను పూర్తిగా నియమించాలని సూచించినట్టు వెల్లడించారు. సమావేశంలో సెక్రటరీతోపాటు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు ఇంజినీర్లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరిగేషన్ శాఖలో ఇప్పటికే ఇద్దరు ఈఎన్సీలు, 11 మంది చీఫ్ ఇంజినీర్లు, 59 మంది ఎస్ఈలు, 30 మందికిపైగా ఈఈలు ఉద్యోగ విరమణ పొందారు. ఆయా స్థానాల్లో అధికారులను నియమించకుండా ఇన్‌చార్జీలు, ఇతరులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్‌లో పాలన గాడి తప్పింది. ఆయా అంశాలపై ఇటీవల 'నమస్తే తెలంగాణ' వరుస ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలో సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు.

సాగునీటి సంఘాల ఏర్పాటుకు కసరత్తు

ఇరిగేషన్ శాఖలో మరోసారి సాగునీటి సంఘాల ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రం ఏర్పడక ముందు స్థానిక రైతులతో చెరువులు, సాగునీటి కాల్వల పరిధిలో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసేవారు. ఎన్నికలు నిర్వహించి వాటికి అధ్యక్షులను, ఇతర డైరెక్టర్లను సభ్యత్వాలు ఉన్న రైతులు ఎన్నుకునేవారు. ఇప్పుడు మళ్లీ ఆ సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించినట్టు తెలిసింది. సంఘాల ఎన్నిక ప్రక్రియపై కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఎన్నికలు నిర్వహించాలా? లేదంటే నామినేట్ చేయడమా? అన్న అంశంపై సమాలోచనలు జరుపుతున్నట్టు సమాచారం.

భూగర్భ జలాల్లో అధిక మోతాదులో నైట్రేట్

- 440 జిల్లాల్లో ప్రమాద ఘంటికలు
- తెలంగాణలోని రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లోనూ అధిక తీవ్రత
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 440 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉన్నట్లు కేంద్ర భూగర్భ జలాల మండలి (సీజీడబ్ల్యూబీ) వెల్లడించింది. 20 శాతం నమూనాల్లో అనుమతించదగినదాని కన్నా ఎక్కువ నైట్రేట్ ఉన్నదని గుర్తించినట్లు తెలిపింది. నైట్రేట్ కాలుష్యం వల్ల పర్యావరణం, ప్రజారోగ్యం దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్ ఆధారిత ఎరువులు, పశువుల పెంటలను ఉపయోగించే వ్యవసాయ ప్రాంతాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. 9.04 శాతం నమూనాల్లో ఫ్లోరైడ్ స్థాయిలు సురక్షిత పరిమితి కన్నా అధికంగా ఉన్నట్లు, 3.55 శాతం నమూనాల్లో ఆర్సెనిక్ కాలుష్యం ఉన్నట్లు సీజీడబ్ల్యూబీ విడుదల చేసిన వార్షిక భూగర్భ జలాల నాణ్యత నివేదిక-2024 తెలిపింది. నైట్రేట్ స్థాయిలు 40 శాతానికిపైగా నమూనాల్లో కనిపించిన రాష్ట్రాలు రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు కాగా, మహారాష్ట్రలో 35.74 శాతం, తెలంగాణలో 27.48 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌లో 23.5 శాతం, మధ్య ప్రదేశ్‌లో 22.58 శాతం నమూనాల్లో నైట్రేట్ అధికంగా కనిపించింది. ఉత్తరప్రదేశ్, కేరళ, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో నైట్రేట్ స్థాయి తక్కువగా ఉంది. సురక్షిత పరిమితి పరిధిలో ఉన్న రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవా, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్. నైట్రేట్ స్థాయులు మితిమీరితే శిశువుల్లో బ్లూ బేబీ సిండ్రోమ్ వంటి సమస్యలు వస్తాయి. ఈ నీరు తాగడానికి సురక్షితమైనది కాదు. భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉన్న జిల్లాలు దేశవ్యాప్తంగా 15 కాగా, వీటిలో తెలంగాణలోని రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్ధిపేట; ఏపీలోని పల్నాడు ఉన్నాయి.

నత్తనడకన హైవేల నిర్మాణం

మార్చి వరకు ఎన్‌హెచ్‌ఏఐ గడువు, సాగని పనులు

పూర్తికాని భూసేకరణ, పనుల్లో తీవ్రమైన జాప్యం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ):